నత్తనడకన యూజీడీ పనులు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు



బురదలో ఇరుక్కుపోయిన ద్విచక్రవాహనదారుడు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ సూర్యానగర్ కాలనీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని రహదారులు మట్టితో నిండిపోవడం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, బీఆర్ఎస్ నేత మేకల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కనీసం ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా వీలులేకుండా మట్టి నిండి ఉందని, అధికారులు చొరవ తీసుకుని పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీలో మంగళవారం సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పనులను ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, కాలనీ అధ్యక్షుడు మొగిలి రాఘవరెడ్డితో కలిసి పరిశీలించారు. త్వరలోనే రత్న హోటల్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు డీఈ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, గంగిరెడ్డి, యాకయ్య, ముఖేష్‌నాయక్ తదితరులున్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పరిశీలన

50 శాతం స్థానికులకు ఇవ్వాలన్న సీపీఐ బృందం



డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

మల్లాపూర్: మల్లాపూర్‌లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు 50 శాతం కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీఎస్.బోస్ అన్నారు. సీపీఐ మల్లాపూర్ డివిజన్ సమితి ఆధ్వర్యంలో ఓల్డ్ మల్లాపూర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సీపీఐ బృందం పరిశీలించారు. సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు శంకర్‌రావు, ధర్మేంద్ర, నర్సింహా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, సీపీఐ డివిజన్ నేతలు శేఖర్, గిరిబాబు, రవి, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



గణేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌కు చెందిన గణేష్ క్రీడా రంగంలో ఎన్నో విజయాలు సాధించారు. జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్, రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, డబ్ల్యూఏసీకేవో ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో మూడోస్థానం, రాష్ట్రస్థాయి బాడీ లిఫ్టింగ్, దేశవ్యాప్తంగా నిర్వహించిన మిస్టర్ ఇండియా పోటీలో గణేష్ 2వ స్థానాన్ని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడారంగంలో రాణించి దేశానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ప్రశాంత్‌రెడ్డి, మహేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



మౌలాలి: బహిరంగ ప్రదేశాల్లో చెత్త, చెదారం పారవేయకూడదని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కాకతీయనగర్‌లోని రోడ్డు నెం.3లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీల్లో చెత్త పాయింట్స్ రహితంగా తీర్చిదిద్దుకోవాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. దీనికి జీహెచ్ఎంసీ సహకారం ఉంటుందని చెప్పారు. నేరేడ్‌మెట్ సీఐ సందీప్, ఎస్సై శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ ఉమాదేవి, కాకతీయనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

భవిత పాఠశాల ప్రారంభం



మండల విద్యాధికారి జ్యోతిరెడ్డి తదితరులు

అల్వాల్: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భవిత పాఠశాలను (విద్యా వనరుల కేంద్రం) మంగళవారం అల్వాల్‌లో మండల విద్యాధికారి జ్యోతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ భవిత పాఠశాల ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా వనరుల కేంద్రం కోసమేనని, 21 రకాల వైకల్యాలకు సంబంధించిన పిల్లలకు అడ్మిషన్స్ పూర్తి ఉచితంగా ఇస్తామన్నారు. పిల్లల్లో ఉన్న వైకల్యానికి తగినట్లు శిక్షణనిచ్చి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, అంగన్‌వాడీ సెంటర్ టీచర్ శ్రీవాణి, ఐఆర్పీ మహస్తందర్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ. 20 లక్షలతో సివరేజ్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. చిలుకానగర్‌లో అతి చిన్న సమస్యను కూడా వెంటనే పరిష్కరిస్తూ.. కార్పొరేటర్ ముందుకు సాగడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. సీసీ రోడ్లు, సీవరేజ్ పైపులైన్లు, తాగునీటి పైపులైన్, శ్మశానవాటికల అభివృద్ధికి కృషిచేయడం అభినందనీయమన్నారు. జలమండలి జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

తెలంగాణ తల్లి చిత్రపటం, విగ్రహానికి పాలాభిషేకం..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం చిలుకానగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పాలాభిషేకం చేశారు. స్థానిక నేతలు, మహిళలు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: రేవంత్ ప్రభుత్వం అరాచకాలకు నిలయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం చేసి అనంతరం పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకైన తెలంగాణ తల్లిని మార్చడం పెద్దతప్పుగా తెలంగాణ సమాజం భావిస్తోందన్నారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, స్థానిక బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

హుండీ లెక్కింపు

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లోని పురాతన మల్లికార్జునస్వామి (శివాలయం) ఆలయం హుండీ మంగళవారం చైర్మన్ నామ్ రాజిరెడ్డి, ఈవో వెల్లంకి నరేంద్ర సమక్షంలో లెక్కించారు. మొత్తం హుండీలో భక్తులు వేసిన రూ.1,03,653 ఆదాయం వచ్చినట్లు ఆలయ ప్రతినిధులు ప్రకటించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన సంపత్, సంధ్య దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు.



మానవహక్కుల పరిరక్షణకు కృషి

గృహ కార్మికుల యూనియన్ సమావేశం



సమావేశానికి హాజరైన మహిళలు

రామంతాపూర్: మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో రామంతాపూర్ నేతాజీనగర్‌లో నివాస గృహాల్లో పనిచేసే గృహ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర కో- ఆర్డినేటర్స్ సిస్టర్ జనస్టిన్ శిష్ట రోజీలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇళ్లలో పనిచేసే కార్మికుల్లో ఎక్కువ మంది మహిళలేనని, కొంతమంది యజమానులు వారి హక్కులను కాలరాస్తూ.. వేధిస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయన్నారు. గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇళ్లలో పని చేసే మహిళలకు ఆరోగ్య భద్రత కోసం భీమా పథకంతో పాటు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇళ్లలో పనిచేసే మహిళలను వేధిస్తే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లేనని, అలాంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ గృహ కార్మికుల యూనియన్ కో- ఆర్డినేటర్ శోభ, సంధ్యారాణి, అనిత, వినీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి



జస్టిస్ షమీమ్‌అక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నేతలు

అల్వాల్: ఎస్సీవర్గీకరణను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సెక్రటరీ శివకుమార్‌మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని, గత 30 ఏళ్లుగా మాదిగ సమాజం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ జరగాలని, అలుపెరగని పోరాటాలు చేశామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ దేశంలో అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నేతలు యాదగిరి, శ్రీనివాస్, నవీన్, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

గౌతంనగర్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రసాద్‌యాదవ్ తండ్రి ఇటీవలే మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ప్రసాద్ ఇంటికెళ్లి ఆయనతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గణేష్ ముదిరాజ్‌ను..

కాంగ్రెస్ సీనియర్ నేత జిన్న గణేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మైనంపల్లి మంగళవారం సాయినగర్‌లోని గణేష్ ఇంటికెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, శ్రీను, ప్రసాద్, రవికుమార్, మోహన్‌రాజ్, క్రాంతి, సత్యనారాయణ, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌యాదవ్ కుటుంబసభ్యులతో మైనంపల్లి



పాశం యాదగిరిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉద్యమకారులను గౌరవించడం హర్షణీయం

మౌలాలి: తెలంగాణ ఉద్యమకారులు, కవులు, కళాకారులను ప్రభుత్వం గుర్తించడం గర్వకారణమని కాంగ్రెస్ నాయకుడు మోటికే చంద్రశేఖర్ కురుమ అన్నారు. తెలంగాణ సచివాలయంలో పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిరావులకు ఫ్యూచర్ సిటీలో 300 గజాల ఇంటి స్థలంతో రూ. కోటి నగదు, తామర పత్రం అందిస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గన్‌పార్కు వద్ద పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిరావును మోటికే చంద్రశేఖర్, పలువురు ఉద్యకారులు, జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. వెంకటేష్, సమ్మయ్య, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



ఉప్పల్ : ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లోని శ్రీ కాలభైరవ ఆలయ బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. డిసెంబర్ 22 నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల ఆహ్వానపత్రాన్ని మంత్రికి అందజేశారు. అర్చకులు కన్నయ్య, కమిటీ సభ్యులు కంచిమీది శివయ్య, లక్ష్మణ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడిగా వెంకన్న



ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి వెంకన్నను జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు సీపీఐ మంగళవారం ప్రకటించింది. తనపై పార్టీ ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబిత

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం వెంకటాపురం డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదన్నారు. బీఆర్ఎస్ నేతలు అనిల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు పాటుపడతాం

మేడ్చల్‌రూరల్: రైతులకు అన్ని విధాల అండగా నిలిచి వారి శ్రేయస్సుకు పాటు పడతామని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మేడ్చల్ మార్కెట్ కమిటీకి చెందిన ఆస్తులు, వనరులు తమ ఆధీనంలోకి తీసుకుని రైతులకు ఉపయోగకరంగా ఉండేలా వాటిని తీర్చిదిద్ది రైతులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తామన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు రైతుల అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు శంకర్ ముదిరాజ్, రేగు రాజు, సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



15 నుంచి గ్రూపు-2 పరీక్షలు

- రెండురోజుల పాటు నిర్వహణ
- అభ్యర్థుల కోసం 116 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ గౌతమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 116 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

◆ మొదటి సెషన్ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8:30 గంటల వరకు రావాలని, 9:30 తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించరన్నారు. రెండో సెషన్ అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 వరకే కేంద్రానికి రావాలని, 2:30 దాటితే ప్రధాన గేట్ మూసివేయవేస్తారని ఆయన పేర్కొన్నారు.



◆ అభ్యర్థులు ఎలాంటి క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్‌డ్రైవ్ లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, వ్యాలెట్, హ్యాండ్ బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు, ఆభరణాలు (మంగళసూత్రం, బ్యాంగిల్స్- సంబంధిత వస్తువులు మినహా) తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు బూట్లు ధరించకూడదని కలెక్టర్ సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు హాల్ టికెట్‌లో సూచించిన విధంగా పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రమే గంట సమయం అదనంగా ఇవ్వబడుతుందన్నారు. వీరు సదరమ్ సర్టిఫికెట్/అపెండిక్స్‌ను పరీక్ష రోజున సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్‌కి అందించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనలు చదివి అనుసరించాలని కలెక్టర్ సూచించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

అల్వాల్: పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్‌లో పేకాడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి 7 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.70 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేకే స్కైవాక్ నుంచి దూకి..

ఎర్రగడ్డ మానసిక వైద్య కేంద్రానికి తరలింపు

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ వంతెనపై నుంచి కిందకు దూకి గాయపడిన వ్యక్తిని చికిత్స అనంతరం ఎర్రగడ్డలోని మానసిక వైద్యకేంద్రానికి తరలించినట్లు ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు. మతి స్థిమితం సరిగ్గా లేని సంగారెడ్డి ప్రాంతానికి చెందిన ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం ఉప్పల్ స్కైవాక్ వంతెనపై నుంచి దూకి గాయపడిన విషయం తెలిసిందే. అతడిని పరిశీలించిన డాక్టర్లు మతి స్థిమితం సరిగ్గా లేదని గుర్తించారు. మంగళవారం చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ మానసిక వైద్య కేంద్రానికి తరలించినట్లు పోలీసులు వివరించారు.

ఘనంగా ఉప్పల్ కేవీ-1 వార్షికోత్సవం

ముఖ్యఅతిథిగా కేరళలోని పాలక్కడ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్

ఉప్పల్: ఉప్పల్‌లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ మొదటి వార్షికోత్సవం మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా కేరళలోని పాలక్కడ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.మోహనప్రియ హాజరయ్యారు. ఆమె ఇదే పాఠశాల పూర్వ విద్యార్థిని కావడం గమనార్హం. నాటి అనుభవాలు, స్మృతులను విద్యార్థులతో పంచుకున్న ఆమె విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రీయ విద్యాలయం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.



విద్యార్థులతో పాలక్కడ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ డా. మోహనప్రియ, అధ్యాపకులు

ప్రిన్సిపాల్ ఈవీ రమణ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల గురించి మాట్లాడారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు, 10-12లో మెరుగైన ఫలితాలపై వార్షిక నివేదికను సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రాథమిక విద్యార్థులు చేసిన స్వాగత నృత్యం, కవాలీ, తెలుగు నృత్యం, రాజస్థానీ డ్యాన్స్ అతిథులను ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడు, సత్యభామ, హనుమంతుడు తదితర పాత్రలతో కూడిన హిందీ లఘునాటిక అంతర్లీనంగా అహంకారం అనర్థదాయకమనే సందేశాన్ని విద్యార్థులు ఇచ్చారు. విశిష్ట అతిథులుగా హాజరైన ఇండియన్ రైల్వే ఇంజినీర్ డాక్టర్ ఇందిరాగాంధీ, జీఎస్ఎన్‌రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులకు బహుమతులు ప్రదానం చేశారు. భారతీయ సంస్కృతులను ప్రతిబింబించేలా కేరళ డాన్స్, మైమ్ షో, అస్సామీ డాన్స్, పంజాబీ డాన్స్, ఫ్యూజన్ డాన్స్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రియారాణి, హెచ్ఎం సంతోషి, సీనియర్ టీచర్స్ ఖలీల్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంటీ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన